



మేఘం మురిసెను.. వానై కురిసెను

- ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

కర్నూలు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా గురువారం ఒక్క సారిగా వాతావరణం మారిపోయింది. ఉదయం ఎండ వేడిమి ఉండగా మధ్యాహ్ననికి ఒక్క సారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమైంది. అర గంట పాటు వర్షం కురిసింది. మళ్లీ సాయంత్రం గంట పాటు మోస్తరు వర్షం కురిసింది. కర్నూలులో మొన్నటి వరకూ 42 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా గురువారం అత్యధిక ఉష్ణోగ్రత 36 డిగ్రీలుగా, అత్యల్ప ఉష్ణోగ్రత 25 డిగ్రీలుగా నమోదైంది. వాతావరణం చల్లబడటంతో జిల్లా ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు. కర్నూలు నగరంలోని ప్రధాన రోడ్లపై వర్షపు నీరు ప్రవహించాయి. రాజ్ విహార్ కూడలి, బళ్లారి చౌరస్తా, కృష్ణా నగర్, బిర్లా గేట్ ప్రాంతాల్లో రోడ్ల పక్కన వర్షపు నీరు నిలిచాయి.

పిడుగుపాటుకు బాలుడు మృతి

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కందనాతిలో పిడుగుపడి బాలుడు మృతి చెందాడు. కందనాతికి చెందిన రవి(15) పొలం పనులు చేసుకుంటుండగా బాలుడికి సమీపంలో పిడుగు పడింది. దీంతో రవి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు పొలంలో పని చేస్తున్న పలువురికి గాయాలయ్యాయి. వారిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గోనెగండ్లలో ఈదురుగాలులతో కూడిన వర్షం

గోనెగండ్ల : గోనెగండ్లలో మధ్యాహ్నం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలు లతో కూడిన వర్షం కురిసింది. పెద్ద వర్షం కాకపోయినా చల్లటి గాలితో కూడిన వర్షం కురవడంతో వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గిపోయి వేసవి తాపం కొంతవరకు తగ్గినట్లు అయ్యింది. ఈదురుగాలికి గోనెగండ్ల నుంచి గంజిహళ్లికి వెళ్లే ప్రధాన రహదారిపై చెట్టు అడ్డంగా కూలిపోవడంతో రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. అలాగే పొలాల్లో, అక్కడక్క డ కల్లాల్లో ఆరబెట్టుకున్న మిరపతో పాటు మొక్క జొన్నలాంటి ధాన్యాలను తడవకుండా కాపాడుకునేం దుకు పట్టాలు కప్పి రైతులు అష్ట కష్టాలు పడ్డారు.



గోనెగండ్లలో కూలిన చెట్టు

ఉరుముల దాటికి ఆరుగురు ఆస్పత్రిలో చేరిక

- నిమిషాల్లో స్పందించిన సి.బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోని యనగండ్ల బస్టాండులో వర్షం కారణంగా తల దాచుకొన్న పలువురికి ఉరుము దాటికి ఇండక్షన్ తగిలింది. క్షణాల్లోనే అక్కడ బస్టాండులోని 40 మందిలో సిబెళగల్ ఉపాధి ఆపరేటర్ సుధాకర్ కోమాలోకి వెళ్లారు. అక్కడే అనుగొండకు చెందిన ఇద్దరూ పొగాకు వ్యాపారులకు ప్యాంట్ షర్టులు ఖాళీ మంటలు వచ్చాయి. గుండ్రేవులకు చెందిన దస్తగిరికి, యనగండ్లకు చెందిన రాఘవేంద్రకు, దేవవరంకు స్పృహ లేక పడిపోయారు. సిబెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి నిమిషాల్లో సమాచారం అందుకొని తమ కమాండర్ లోనే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉన్న సుధాకర్‌ను ఏమర్జెన్సీలో చేర్పించి ప్రాణాలు కాపాడారని, అందరి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి వైద్యులతో ప్రథమ వైద్యం అందించారు. ప్రాణాపాయ స్థితి నుండి కోలుకున్నారని ఉరుము బాధితులు వారి బంధువులు. అక్కడికి చేరుకున్న టిడిపి నాయకులు పోలకల్ తిమ్మప్ప ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు.

ఈదురు గాలుల వానకు నేలకొరిగిన వరి పైర్లు

- రైతుల కలవరం

మండలంలో గురువారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం భారీగా కురిసింది. దీంతో చేతికంది వచ్చిన వరి పైర్లు ఓ ఇరవై ఎకరాల మేర నెలకొరిగాయి. ఓ రెండు మూడు రోజుల్లో కోతకు సిద్ధపడిన రైతులకు ఈ అకాల వర్షంతో కలవరం నెలకొంది. ఎకరాకు సుమారు రూ.40వేల నుండి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టారు. తెగుళ్లు లేని వరి పంటగా నమోదైన వేళ దిగుబడి ఏ మాత్రం తగ్గుతుందోనని రైతన్నలు మనోవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టాలు చవి చూడాల్సి వస్తే ప్రభుత్వం ఆదుకోవాలని మొరపెట్టుకొంటున్నారు. ఇందులోనే ముందస్తు వర్షాలు కురుస్తున్నాయని ఏ పంటలు సాగు చేయవద్దని ఎఐ మల్లేష్ కుమార్ మండలంలోని రైతులకు ఈ సందర్భంగా సూచించారు.



బాధితుని పరామర్శించి మాట్లాడుతున్న ఎస్ఐ తిమ్మారెడ్డి

ఈసారీ కందిపప్పు లేదు..!

- ఈనెల రేషన్‌లోనూ సరఫరా చేయని ప్రభుత్వం
- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.150పైనే

ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని, ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్ మొదటి నుంచీ సమీక్షల్లో చెబుతూనే ఉన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది కూటమి సర్కారు ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెడుతుందంటూ చెప్పుకొచ్చారు. ఆచరణలో పూర్తి స్థాయిలో సరుకుల పంపిణీపై దృష్టి సారించలేకపోతున్నారు. ఐదు నెలలుగా రేషన్‌లో కందిపప్పు సరఫరా కావడం లేదు. కేవలం బియ్యం, పంచదారతోనే సరిపెడుతున్నారు...



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో 1,228 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 6,76,209 రేషన్ కార్డులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5,41,804 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటికి నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. నాలుగు నెలలుగా కందిపప్పు కేటాయించడం లేదు. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు కర్నూలు జిల్లాకు 676.209 మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాకు 541.804 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంది. జిల్లాలో కొన్ని నెలలుగా కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఫిబ్రవరి నెలలో 30 శాతం కార్డులకు బఫర్ స్టాక్ నుంచి పంపిణీ చేశారు. మార్చి నెలలో అసలు ఎలాంటి కేటాయింపులు చేయలేదు. ఏప్రిల్ నెలలోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లాలో ఒక్క లబ్ధిదారునికి కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కందిపప్పు పూర్తిగా నిలిపివేయడంతో పేదలు పప్పునీళ్లకు కూడా దూరమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సరఫరా చేయాల్సిన సరుకులను ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ వస్తుంది. గతంలో టిడిపి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో ఇచ్చారు. ప్రతి నెలా కందిపప్పు అరకొరగానే పంపిణీ చేశారు. పండుగ తోఫాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఈ ఏడాది జూన్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా అన్ని సరుకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. కాని ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. కనీసం కందిపప్పు కూడా సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశే మిగిలింది. ఉగాది, రంజాన్ పండుగలకు ప్రభుత్వం అన్ని రేషన్ సరుకులను ఇస్తుందని లబ్ధిదారులు ఆశించినా నిరాశే ఎదురైంది.

బహిరంగ మార్కెట్లో కొనలేక

ప్రజలు నిత్యం వాడే కందిపప్పు నాణ్యతను బట్టి ధర రూ.150 నుంచి 180 వరకూ ఉంది. రాయితీ పోను కిలో కందిపప్పు రూ.67కే లభిస్తున్నందున రేషన్ షాపుల ద్వారా కందిపప్పు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నా కూటమి సర్కారు సైతం పట్టించుకోవడం లేదు. కందిపప్పు ధర భారీగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దానికి తోడు పేదలపై భారాలు రోజురోజుకి ఎక్కువ అవుతున్నాయి. దీంతో కందిపప్పు కొనుగోలు చేయలేని దుస్థితి ఏర్పడింది. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తున్నామనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం కందిపప్పు పంపిణీ చేపట్టింది. అది నాణ్యత తక్కువగా ఉండడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరపై రూ.10 నుంచి రూ.20 వరకు కిలోపై ధర తగ్గిస్తున్నా, ఇది రెండో రకం కందిపప్పు కావడంతో తీసుకునేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు.

పేదల బతుకులు మారడం లేదు

- ఉమాదేవి, లక్ష్మీ నగర్, కర్నూలు.



పాలకులు మారినా పేదల బతుకులు మారడం లేదు. గతంలో టిడిపి ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు బియ్యం, కందిపప్పు, ఉప్పు, కారం, చక్కెర, జొన్నలు, గోధుమలు, చింతపండు లాంటి నిత్యవసర సరుకులు రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. ప్రభుత్వాలు మారే కొద్దీ పేదలకు ఇచ్చే నిత్యవసర సరుకులు ఒక్కొక్కటి తగ్గిస్తూ వచ్చారు. ప్రస్తుతం బియ్యము, చక్కెర తప్ప ఏ సరుకులూ ఇవ్వడం లేదు. కందిపప్పు కూడా మూడు నెలలుగా ఇవ్వడం లేదు. బయటకుందామంటే సామాన్య ప్రజలకు నిత్యవసర ధరలు చుక్కలను అంటుతున్నాయి. టమాటా చారు చేసుకుని చట్నీ నూరు కొని అన్నంలో కలుపుకుని తినాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజలకు నిత్యవసర సరుకులు ఇచ్చి ఆదుకోవాలి.

సరుకులు ఇచ్చి ఆదుకోవాలి

- మహేశ్వరి, గీతా నగర్, కర్నూలు.



మూడు నెలలుగా రేషన్ షాపుల ద్వారా ఇచ్చే కంది బేడలు ఇవ్వడం లేదు. దీంతో పప్పు వండుకునే పరిస్థితి లేకుండా పోయింది. భార్యాభర్తలం పగలంతా కష్టపడితే వచ్చే డబ్బులతో కుటుంబం మొత్తం కడుపునిండా మూడు పూటలా తిండి కరువైంది. పిల్లలకు మూడు పూటలా పెట్టి పెద్దలు ఒక పూట తిని పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం పేదల కోసం నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలి లేదా రేషన్ షాపుల ద్వారా ఇచ్చే సరుకులైనా తక్కువ ధరలకు అందించి ఆదుకోవాలి.

వివాహ వేడుకలో జగన్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగర శివారులోని జీఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో కుడా మాజీ ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి కుమార్తె వివాహ వేడుకలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. వధూవరులు శ్రేయ, వివేకానంద విరూపాక్షలను ఆశీర్వదించారు. తొలుత తాడేపల్లి నుంచి హెలీకాప్టర్ ద్వారా కర్నూలు నగరంలోని మైపర్ కళాశాల మైదానానికి చేరుకున్న జగన్ అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా జిఆర్‌సి కన్వెన్షన్ హాల్‌కు చేరుకున్నారు. ఆయనకు వైసిపి నేతలు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా మైపర్ కళాశాల మైదానానికి చేరుకుని హెలీకాప్టర్ ద్వారా తాడేపల్లికి తిరుగు ప్రయాణం అయ్యారు. జగన్‌తో పాటు నంద్యాల జిల్లా వైసిపి అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి. కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా పరిషత్ ఛైర్మన్ పాపిరెడ్డి, కర్నూల్ నగర మేయర్ రామయ్య, ఎమ్మెల్యేలు విరూపాక్షి, బాలనాగిరెడ్డి మాజీ ఎమ్మెల్యేలు ఎంఎ హాఫీజ్ ఖాన్, కంగాటి శ్రీదేవి, శిల్పా చక్రపాణి రెడ్డి, గంగుల బిజేంద్రనాథ్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, కోడుమూరు ఇంఛార్జి ఆదిమూలపు సతీష్ పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు : జెసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని మిని కాన్ఫరెన్స్ హాలులో ఏరోడ్రోమ్ కమిటీ, ఎయిర్‌ఫీల్డ్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... ఎయిర్‌పోర్టు ఆవరణంలో పచ్చదన వాతావరణం కల్పించాలన్నారు. ఎయిర్‌పోర్టులోని చెత్తను గతంలో లాగా డంప్ యార్డు ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు ఎంపిడిఒకు సూచించారు. సమావేశంలో ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, డిఎంఅండ్‌హెచ్‌ఒ శాంతి కల, కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్, ఐబిడి ఎస్ పి.మధు ,ఆర్‌టిసి ఆర్‌ఎం శ్రీనివాసులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి, డిడి మైన్స్ రవిచంద్ర, ఎలక్ట్రికల్ డిఇ శేషాద్రి, ఎంపిడిఒ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

రైతుల నుండి జొన్నల కొనుగోలు

రైతుల పండించిన జొన్నలను నేరుగా రైతు సేవా కేంద్రాలలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జొన్నాలకు క్వింటా రూ.3371 లు మద్దతు ధర ప్రభుత్వం కల్పించిందన్నారు. జొన్నలుకూడా హైబ్రిడ్ రకము సి.43 లేదా మహేంద్ర రకము మాత్రమే రైతుల నుండి తీసుకున్నారు.

పదోతరగతి మూల్యాంకనం ప్రారంభం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని సబ్జెక్టుల మూల్యాంకనం గురువారం బి-తాండ్రపాడులోని క్రీడో పాఠశాలలో ప్రారంభమైంది. కర్నూలు జిల్లాకు ఒక లక్ష 93 వేలా 747 పేపర్లు వచ్చాయి. గురువారం నాడు సాంఘిక శాస్త్రం ఒకేషనల్ మినహా 11081 పేపర్ల మూల్యాంకనం జరిగింది. మూల్యాంకనం 5.7 శాతం నమోదయింది. మూల్యాంకన కేంద్రంలో ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు చేపట్టారు. మొదటిరోజు చీఫ్ ఎగ్జామినర్లు 89 మంది, 537 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు 145 మంది స్పెషల్ అసిస్టెంట్లు హాజ రయ్యారు. ఓపెన్ టెన్త్ పరీక్షలకు సంబంధించి 16,220 పేపర్లు రాగా గురు వారం 1275 పేపర్ల మూల్యాంకనం చేశారు. వీటికి 15 మంది చీఫ్ ఎగ్జామినర్లను 82 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లను నియమించారు. మూల్యాంకనాన్ని హాజరైన వారికి ఎటువంటి అసౌకర్య లేకుండా విద్యాధికారులు పర్యవేక్షించారు.

సిఆర్‌ఆర్‌ఎం పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కట్టమంచి రామ లింగారెడ్డి స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇఎన్‌టి స్పెషలిస్ట్ డాక్టర్ ఎస్‌ఎం వెంకటేశ్వర్లు విద్యార్థులకు చెవి, ముక్కు, గొంతు సంబంధించిన పరిశుభ్రత పై ఎలాంటి జాగ్రత్తలుతీసుకోలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ మేనేజర్ కెఎం.బాష, ప్రధానోపాధ్యాయులు టి. వెంకటరెడ్డి, ఎస్‌ఎంసి చైర్ పర్సన్ దూదేకొండ. కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

ఎండలతో జర జాగ్రత్త...

-చిన్నపిల్లలు, వృద్ధులు, బాలింతలు అప్రమత్తత అవసరం

-డాక్టర్ కల్పన

ప్రజాశక్తి-పత్తికొండ



ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని పత్తికొండ ప్రభుత్వ గైనిక్ డాక్టర్ కల్పన అన్నారు. గురువారం ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పత్రికా విలేకరుల సమావేశంలో డాక్టర్ కల్పన మాట్లాడుతూ ఏప్రిల్, మే ,జూన్ మాసాలలో ఉష్ణోగ్రతలు మార్పు చెంది తీవ్రత స్థాయిలో వేడి గాలులు వీచే అవకాశం ఎక్కువగా ఉంటుందని అన్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇంటి నుండి బయటకు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలని, మజ్జిగ, నిమ్మరసం తరచుగా తీసుకోవాలని అన్నారు. ఎవరైనా బయటికి వెళ్లేటప్పుడు తేలికపాటి దుస్తులు, కాటన్ దుస్తులు, తెల్లదుస్తులు ధరించి, వాటర్ బాటిల్‌ను తీసుకొని వెళ్లాలన్నారు. పనిచేసుకునే ప్రదేశంలో రైతులు, వ్యవసాయ కూలీలు, ఇతర పనులు చేసుకునే ప్రజలు టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించిన వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకురావాలన్నారు. 24/7 డాక్టర్లు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు.

వక్ఫ్ ఆస్తులను కాజేయడానికి చట్ట సవరణ

-విద్వేషాలు రెచ్చగొట్టేందుకు బిజెపి కుట్ర
-రాజకీయ లబ్ధి దాని అసలు రహస్యం
-రాజ్యాంగ హక్కులకు భంగం
-ముస్లింలను మోసగించిన చంద్రబాబు
-మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ముస్లిం వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టడమే ప్రధాన లక్ష్యంగా పార్లమెంటులో వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్ ఖాన్ అన్నారు. గురువారం కర్నూలు కండేరిలోని స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ వక్ఫ్ అంటే దేవుని ప్రసన్నం కోసం అప్పగించుకున్న భూమి అని అర్థం అన్నారు. రాజ్యాంగం దీన్ని ప్రత్యేకంగా ముస్లింలకు హక్కును కల్పిస్తూ ఈ చట్టాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాస్తూ వక్ఫ్‌బోర్డు బిల్లుకు చట్ట సవరణ చేసిందన్నారు. దేశంలో మెజారిటీ సభ్యులు వ్యతిరేకించినప్పటికి ఏకపక్షంగా వ్యవహరిస్తూ చట్టాన్ని సవరిస్తోందన్నారు. 288 మంది ఓటింగ్ చేయగా 232 మంది సభ్యులు దీన్ని వ్యతిరేకించారన్నారు. ముస్లింల అణిచివేతకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. దేశ ప్రజలను మతం పేరుతో విభజించే చర్యలకు బిజెపి పాల్పడుతోందన్నారు. మందిరం మసీదు పేరుతో విభజించి తన రాజకీయ పబ్బాన్ని గడుపుకోవాలని ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి రిజిజు చెప్పే మాటలకు ఏమాత్రం పొంతన లేకుండా పోయిందన్నారు. వక్ఫ్ బోర్డులో మహిళలను, పేదలను సభ్యులుగా చేర్చాలని వారు చెబుతున్నప్పటికీ ఇదివరకే అది అమలవు తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 40 ఏళ్ల అనుభవం కలిగిన సిఎంనని చెబుకుంటూ వక్ఫ్ బోర్డు బిల్లు సవరణకు ఆమోదం తెలపడం పట్ల ముస్లిం సామాజిక వర్గం క్షమించ బోదన్నారు. ఈ చర్య ద్వారా ముస్లిం సామాజానికి తీరని అన్యాయం చేశారన్నారు. తాను మారానని చెప్పిన చంద్రబాబు ఈ చర్య ద్వారా ఏమాత్రం మారలేదని నిరూపించుకున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి నిత్యం ప్రజల పక్షాన నిలబడ్డ నాయకుడు అన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్ని కుట్రలు చేసినా వైసిపి ఎదుర్కొంటుందని చెప్పారు. ప్రజలు భవిష్యత్తులో తగిన గుణపాటాన్ని చెబుతారు అన్నారు.

పెన్షనర్ల రూల్స్ సవరణ చట్టమైతే ఉరితాడే

పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పెన్షన్ రూల్స్ సవరణ బిల్లు పాస్‌అయి చట్టం అయితే పెన్షనర్లకు ఉరి తాడు అవుతుందని, అందుకు పెన్షనర్లు పోరాటాలకు సిద్ధం కావాలని బిఎస్‌ఎన్‌ఎల్ డాట్‌పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్. విజయభాస్కర్, ఆల్ ఇండియా బిఎస్‌ఎన్‌ఎల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జెవి.రమణ, సంచార్ నిగం పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ బి.భాస్కరరావు పెన్షనర్లకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బిఎస్‌ఎన్‌ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ కార్యాలయం దగ్గర నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ అసోసియేషన్లు న్యూఢిల్లీ వారి పిలుపులో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఏ ఐ బి డి పి ఏ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎం. యాకోబ్ అధ్యక్షత వహించారు. ఆల్ ఇండియా బిఎస్‌ఎన్‌ఎల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జెవి.రమణ, సంచార్‌నిగం పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ బి.భాస్కరరావు మాట్లాడారు. 2025 మార్చి 25న కేంద్ర ప్రభుత్వం పెన్షన్ రూల్స్ అతి ప్రమాదకరమైన తీవ్ర నష్టదాయకమైన సవరణను లోక్ సభలో ఆర్థిక బిల్లులో భాగంగా ప్రవేశపెట్టి పాస్ చేయించు కొన్నదని చెప్పారు. రాజ్యసభలో కూడా 27 2025 మార్చి 2న బిల్లు పాస్‌అయిందన్నారు. రాష్ట్రపతి ఆమోదం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. అది చట్టం అయితే రూ.50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు ఉరితాడుగా మారుతుందన్నారు. అంతేకాకుండా కోట్లాదిమంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్లకు బీమా బ్యాంకు తదితర అన్ని రంగాల ఉద్యోగులు కూడా ఉరితాడుగా మారుతుందన్నారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ పెన్షన్ రూల్స్ అమల్లోకి వచ్చిన ఒకటి ఆరు 1972 నుండి అంటే 53 ఏళ్లు వెనక నుండి దీన్ని అమలు చేయడం ద్వారా చరిత్రను అర్ధ శతాబ్దం వెనక్కి తిప్పే దారుణమైన ప్రయత్నమన్నారు. భారతదేశంలోని పెన్షనర్లు అందరూ రిటైర్ అయినప్పుడు ఫిక్స్ అయిన పెన్షన్ తప్ప ఎటువంటి పెరుగుదల లేక హీనమైన జీవితం గడపాల్సి ఉంటుందన్నారు. గత 70 ఏళ్లలో ఉద్యోగులు, పెన్షనర్లు పోరాడి సాధించుకున్న హక్కులను ప్రభుత్వం నీరు గార్చే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. సుప్రీం కోర్టు ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం "పెన్షన్ భిచ్చకాదు, అది హక్కు" అని తీర్పునిచ్చిందని తెలిపారు. డిఎస్‌నకారా కేసులో పై తీర్పు విలువరించిందని అన్నారు. భవిష్యత్తులో పోరాటాలకు సిద్ధం కావాలని పెన్షనర్లకు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా బిఎస్‌ఎన్‌ఎల్ పిడబ్ల్యూఎ జిల్లా అధ్యక్షులు ఎ. రామాంజనేయులు, ఎస్‌ఎన్‌పిడబ్ల్యుసి డబ్ల్యూ సి మెంబర్ బి. భాస్కరరావు, ఎస్‌ఎన్‌టి డబ్ల్యుఎ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి సురేష్, ఎఐ బిడిపిఎసిఎస్ డి.వెంకట్రాంరెడ్డి, సహాయ కార్యదర్శి ఎస్కే షబ్బీర్, వైసి హెచ్. ఎల్లయ్య, ఎ.మద్దిలేటి, బి.విజయలక్ష్మి, ఫాతిమా ఖాతూన్, మద్దిలేటమ్మ , ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.



బిఎస్‌ఎన్‌ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పెన్షనర్లు

విజయవాడకు రైల్వే సర్వీస్ అవసరం

కేంద్ర మంత్రిని కోరిన మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



కర్నూలు నుండి విజయవాడకు రైల్వే సర్వీస్‌లను నడపాలని పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ కేంద్ర మంత్రిని కోరారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్ మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. కర్నూలు నుండి ముంబైకి కూడా రైలు సర్వీసు అందుబాటులోకి తేవాలన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌లో ఎన్నో పరిశ్రమలు రానున్నట్లు కేంద్ర మంత్రికి భరత్ వివరించారు. భవిష్యత్తులో ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా ఓర్వకల్లు మారబోతుందన్నారు. ఈ ప్రాంతానికి దేశంలోని ప్రధాన నగరాలతో రైలు రాకపోకలు ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు టిజి.భరత్ తెలిపారు. ఈ రైల్వే సౌకర్యాలపై తప్పకుండా పరిశీలిస్తామని ఆయన చెప్పారన్నారు.



యానిమేటర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

యానిమేటర్లకు శిక్షణ

ప్రజాశక్తి-మద్దికేర

పొదుపు మహిళల ఆర్థిక ప్రణాళికపై ఎపిఎం రామాంజనేయులు బుధవారం వెలుగు కార్యాలయంలో యానిమేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వెలుగు సిసిలు పొదుపు మహిళలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మహిళల అవసరాలు, జీవనోపాదులు, అదనపు వ్యాపారాలకు సంబంధించిన, ప్రతి యాని మేటర్ల కు 6 చిన్న సంఘాలు కేటాయించి ఆ సంఘాల మహిళల కుటుంబాల ఆదాయ ఖర్చుల అవసరాల అభివృద్ధి ఆర్థిక వార్షిక ప్రణాళిక గురించి సర్ఫ్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేయాలన్నారు. బుధవారం నుండి శుక్రవారం వరకు మూడు రోజులు ఈ అవగాహన సదస్సులు ఉంటాయని వెలుగు సిసిలు, బుక్ కిపర్లు పొదుపుమహిళలు తప్పనిసరిగా హాజరై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గుడికంబాలిలో పకడ్బందీగా రీ సర్వే

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - కౌతాళం



రైతులకు నోటీసులు అందజేస్తున్న సబ్ కలెక్టర్

పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన కౌతాళం మండలం గుడికంబాలి గ్రామంలో రీసర్వే పకడ్బందీగా కొనసాగుతోందని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గురువారం రైతులకు 9(2) నోటీసులు పంపిణీ చేయడానికి గ్రామసభ నిర్వహించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ రైతులకు నోటీసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలోని భూమి కలిగిన రైతులందరూ గ్రామ సర్వేయర్, విఆర్ఒ ద్వారా 9(2) నోటీసులు స్వీకరించాలని కోరారు. నోటీసులో రీ సర్వే ద్వారా నమోదు చేసిన భూమి విస్తీర్ణంపై ఏమైనా అభ్యంతరాలుంటే, నోటీసు అందిన 21 రోజుల్లోపు విఆర్ఒ వద్ద అందుబాటులో ఉన్న ఫారంలో అభ్యంతరాలను రాత పూర్వకంగా తెలియజేయాలని చెప్పారు. రైతుల అభ్యంతరాలపై రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ప్రొసీడింగ్స్ జారీ చేస్తారని తెలిపారు. రైతులకు మరింత సమాచారం అవసరమైతే తహశీల్దార్ కూడా అభ్యంతరాలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. తహశీల్దార్ రజినీకాంత్ రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, మండల సర్వేయర్ బసవరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మన్న, విఆర్ఒ నాగార్జున, గ్రామ సర్వేయర్ విజయ్ కుమార్, సర్పంచి సిద్ధేష్ పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి : టిడిపి

- ఎర్రబాడులో సిసి రోడ్డు పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - గోనెగండ్ల



భూమి పూజ నిర్వహిస్తున్న నాయకులు

గ్రామాల్లో అభివృద్ధి పనులు గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలోనే జరిగాయని, ప్రస్తుతం కూడా టిడిపి కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయని టిడిపి మండల నాయకులు తెలిపారు. గురువారం మండలంలోని ఎర్రబాడు గ్రామంలో శివాలయం నుంచి ముల్లా ఖాజా హుస్సేన్ ఇంటి వరకు రూ.10 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. పనులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నాయకులు బేతాళ బడేసా, తిరుపతయ్య నాయుడు, పి.రంగముని, కాంట్రాక్టర్ షేక్షావలీ, ఎర్రబాడు శ్రీను, మౌలా, కటిక షేక్షావలీ, ఏసు, కుమార్, యాగంటి, ఆచారి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన 'మోడల్' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఆలూరు

జాతీయ స్థాయి ఉడ్ బాల్ క్రీడా పోటీల్లో రాణించిన ఆలూరు మోడల్ స్కూల్ విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యా యుని గురువారం పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు అభినందించారు. మార్చి 22 నుంచి 26 వరకు మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ టీమ్ నుంచి క్రీడాకారులు ప్రతిభ చాటారు. 19వ సీనియర్, 13వ సబ్ జూనియర్ నేషనల్ ఉడ్ బాల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొన్న ఆలూరు మోడల్ స్కూల్ విద్యార్థులు కె.అస్లాం బాష 2 బంగారు పతకాలు, సి.యువరాజు ఒక బంగారు పతకం, క్రాంతి కిరణ్, కె.రుత్విక్, బి.విశ్వతేజ చెరో ఒక కాంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ ఆర్.రాఘవ రావు తెలిపారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు ఈరన్నను ప్రిన్సిపల్ రాఘవరావు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు కపిలేశ్వరయ్య, వెంకటేష్, రంగస్వామి పూలమాలలు వేసి అభినందించారు.

మంత్రిని కలిసిన ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని



విజయవాడలో కర్నూలు జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి సమస్యలు విన్నవించామని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. మంత్రి నివాసంలో శాలువా కప్పి మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, సానుకూలంగా స్పందించారని చెప్పారు. త్వరలో నియోజకవర్గంలోని టిడిపి శ్రేణులకు మంచి రోజులు వస్తాయని భరోసా ఇచ్చారన్నారు.

మళ్లీ మొదలైన శ్మశాన స్థల వివాదం

- ఖననాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహల్లి గ్రామంలో శ్మశాన స్థల సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. గురువారం విఆర్ఎ నాగేంద్ర భార్య లక్ష్మమ్మ మృతితో సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో ఖననం చేసేందుకు సన్నాహాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సీలు తమ ఇళ్ల ముందు పూడ్చుతున్నారని తహశీల్దార్ ఎస్.రవి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు విఆర్ఒ భీమయ్య, ఎస్ఐ శివాంజల్ గ్రామానికి చేరుకొని ఎస్సీల ఇళ్లకు సుమారు 150 అడుగుల దూరంలో ఆమె మృతదేహాన్ని పూడ్చి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. విఆర్ఒ నిర్వాకం వల్లే మళ్లీ మృతదేహాన్ని పూడ్చకుండా అడ్డుకున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో ఎవరు చనిపోయినా అధికారులు, పోలీసుల సమక్షంలో ఖననం చేయాల్సిన దుస్థితి నెలకొందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. పోరంబోకు స్థలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇచ్చి సమస్యగా మార్చారని, విఆర్ఒ తప్పిదం వల్ల ఇలాంటి పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. తహశీల్దార్ ఎస్.రవి, ఎస్ఐ శివాంజల్, విఆర్ఒ భీమయ్య సాక్షిగా మృతదేహాన్ని ఖననం చేసి ప్రస్తుతానికి సమస్యను పరిష్కరించారు. గతంలో కూడా సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కూడా శ్మశాన స్థల వివాదంపై స్పందించి సమస్య పరిష్కారమయ్యే వరకు యథావిధిగా కొనసాగించాలని ఆదేశించారని తెలిపారు. ఆయన ఆదేశాలు కూడా విఆర్ఒ బేఖాతరు చేశారని, ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.




గ్రామస్తులతో మాట్లాడుతున్న తహశీల్దార్, ఎస్ఐ

వక్ఫ్ బోర్డు బిల్లు ఆమోదం దురదృష్టకరం

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్

ప్రజాశక్తి - ఆదోని

వక్ఫ్ బోర్డు బిల్లు ఆమోదం పొందడం దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ తెలిపారు. గురువారం ఆదోనిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు ఎంఎండి.నూర్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలోనే బుధవారం చీకటి రోజుగా పేర్కొన్నారు. పార్లమెంట్‌లో వక్ఫ్ బోర్డు బిల్లు ప్రవేశపెట్టి దేశంలో ముస్లిం సమాజాన్ని మొత్తం చీకటి వ్యవస్థలోకి బిజెపి ప్రభుత్వం నెట్టి వేసిందని మండిపడ్డారు. ఈ వక్ఫ్ బోర్డు బిల్లు గురించి కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా ఈ బిల్లు వల్ల పేద ముస్లింలకు న్యాయం జరుగుతుందని అబద్ధపు మాటలు పార్లమెంట్‌లో చెప్పడం అమానుషమని విమర్శించారు. ఈ బిల్లు వల్ల ఏ ముస్లింకూ న్యాయం జరగదని తెలిపారు. కాంగ్రెస్ మైనార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు ఎమ్‌డి.నూర్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీలు టిడిపి, జనసేనలు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం దారుణమని తెలిపారు. ఈ బిల్లుకు మద్దతు ఇవ్వబోమని ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు చెప్పి నమ్మించి ముస్లిం ఓట్లను వేయించుకొని ఇప్పుడు కుర్చీలో కూర్చున్నాక మాట మార్చారని విమర్శించారు. రాష్ట్ర ముస్లిం సమాజం గమనించాలన్నారు. నాయకులు మహబూబా, టాకీస్ రఫిక్, తాయన్న, అమన్, నాసిర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

'మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



మంత్రికి లేఖలు పంపుతున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ శాఖ మంత్రికి కార్మికులు లేఖలు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు హామీ ఇచ్చారని, అధికారంలోకి ప్రభుత్వం వచ్చి 9 నెలలైనా కార్మికుల గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రతపై భయాందోళనలో ఉన్నారని తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి తక్షణమే చొరవ తీసుకొని ఆప్కాస్‌ను కొనసాగించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కారుణ్య పోస్టులను భర్తీ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. పిఆర్‌సి ఇవ్వాలని, గ్రాట్యుటీ, పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.మునీంద్ర, కె.ఖాజా, బోరు బాష, బి.రంగస్వామి, సల్మాన్, దేవ మాత, పల్లవి రాజు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సబ్ కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - ఆదోని

అవార్డు గ్రహీతను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అభినందించారు. ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా)కు ఉత్తమ సేవా సంస్థగా, వంకదారు శ్రీనాథ్ గుప్తకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్తమ సంఘ సేవా కర్తగా, ఉత్తమ సంఘ సేవ కేటగిరిలో బంగారు నంది అవార్డును తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు చెందిన మెగా హెల్ప్ ఫౌండేషన్ ద్వారా అవార్డు అందుకున్నారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వంకదారు శ్రీనాథ్ గుప్తను అభినందించారు. ఆవోపా బృందానికి, మెడికల్ క్యాంపులకు సౌజన్య కర్తగా వ్యవహరించిన కాకుబాళ్ నగేష్‌కు చెందుతుందని సబ్ కలెక్టర్ వివరించారు.



దేవనకొండ మండలాన్ని కరువుగా ప్రకటించాలి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వీరశేఖర్

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ మండలాన్ని కరువుగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల ప్రకటన అశాస్త్రీయంగా ఉందని, దీనివల్ల చాలా మండలాలకు అన్యాయం జరిగిందని తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్‌కు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరశేఖర్, సిపిఎం మండల కమిటీ సభ్యులు అశోక్, యూసుఫ్ బాష మాట్లాడారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో మండల రైతులు తీవ్రంగా నష్టపోయారని, అకాల వర్షాలు, తుపాన్ల నేపథ్యంలో సరైన దిగుబడి రాక భారీగా నష్టపోయారని తెలిపారు. వేరుశనగ, మిరప, పప్పు శనగ రైతులు కనీసం పెట్టుబడులు కూడా తిరిగిరాని పరిస్థితి నెలకొందని చెప్పారు. వేరుశనగ ఎకరాకు 3, 4 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందని, పెట్టుబడి మాత్రం రూ.40 వేలకు దాటిందని పేర్కొన్నారు. మిర్చి రైతును కదిలిస్తే కన్నీరేనని, ఎంతో ఆశతో సాగుచేసిన మిరప దిగుబడిలో నష్టం వచ్చిందని తెలిపారు. గిట్టుబాటు ధర లేక మిరప రైతు అప్పుల్లో కూరుకు పోయారని పేర్కొన్నారు. పప్పు శనగ పరిస్థితి అధ్వానంగా ఉందని, ఈ నేపథ్యంలో మండలాన్ని కరువుగా ప్రకటించి రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరువు ప్రకటనలో ప్రభుత్వం పారదర్శకత పాటించాలని, నిత్యం కరువుకు గురవుతున్న మండలాన్ని విస్మరించడం తగదని తెలిపారు. పక్కన ఉన్న పత్తికొండ, క్రిష్ణగిరిలో కరువు ఉండి దేవనకొండలో పరిస్థితి బాగా ఉందనడం తగదని పేర్కొన్నారు. మండలంలోని పైతట్టు గ్రామాలు వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. మండలాన్ని కరువుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. దేవనకొండ, మాచాపురం, కుంకనూరు రైతులు బిఆర్.రంగన్న, చిన్నబండ్లి, సూరి, రామాంజనేయులు, రంగన్న, లక్ష్మన్న, ఆంజనేయులు, నరేష్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

నందవరం ఎస్ఐగా కేశవ్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నందవరం



నందవరం ఎస్ఐగా ఎం.కేశవ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీ నిమిత్తం నందవరం పోలీసు స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. మండలంలో శాంతి భద్రతలను నెలకొల్పడానికి కృషి చేస్తానని తెలిపారు.

ఉపాధి హామీలో బదిలీలు

- ఎంపిడిఒ రాధ

ప్రజాశక్తి - మంత్రాలయం

ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న ఏపీవోతో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. గురువారం ఏపీవోగా భక్తవత్సలం ఎంపిడిఒ రాధ అనుమతితో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాధ మాట్లాడారు. హోళగుంద ఏపీవోగా పని చేస్తున్న భక్తవత్సలం బదిలీపై మంత్రాలయం వచ్చారని తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న తిమ్మారెడ్డి హోళగుంద ఏపీవోగా బదిలీపై వెళ్లారని చెప్పారు. టెక్నికల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న రఘువీరనాయుడు ఎమ్మిగనూరుకు, గణేష్, రేణుకలు పెద్దకడుబూరు మండలానికి బదిలీ అయ్యారని తెలిపారు. ఈసీ శ్రీనివాసులు, మరో టెక్నికల్ అసిస్టెంట్ మరధ్వతి నందవరం మండలానికి బదిలీ అయ్యారని చెప్పారు. పెద్దకడుబూరు మండలం నుంచి రామ్మోహన్ రెడ్డి, సిబెళగల్ మండలం నుంచి హితేంద్ర రెడ్డి మంత్రాలయం మండలానికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. 9 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు కొందరు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారని, మరో ఇద్దరు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.



సంబరాలు చేసుకుంటున్న సభ్యులు

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఆదోని బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరాములు

ప్రజాశక్తి - ఆదోని

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు వి.శ్రీరాములు గురువారం తెలిపారు. ఆదోని పట్టణంలో బార్ అసోసియేషన్ ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. ప్రెసిడెంట్‌గా వి.శ్రీరాములు 101 మెజారిటీతో, వైస్ ప్రెసిడెంట్‌గా జె.వెంకటేశులు 186 మెజారిటీతో, జనరల్ సెక్రటరీగా ఎల్‌కె.జీవన్ సింగ్ 109 మెజారిటీతో, జాయింట్ సెక్రటరీగా పి.రాజారత్నం 49 మెజారిటీతో గెలుపొందారు. గెలుపొందిన వారిని బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు.

వివాహ వేడుకల్లో కప్పట్రాళ్ల బొజ్జమ్మ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని బంటుపల్లి, నెల్లిబండ, కప్పట్రాళ్ల గ్రామాల్లో గురువారం జరిగిన వివాహ వేడుకలకు రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకలకు హాజరైన ఆమెను ఆయా గ్రామాల్లోని టిడిపి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి పూలమాలలతో సన్మానించారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న బొజ్జమ్మ

దౌల్తాపురంలో పొలం రీ సర్వే

- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి



ప్రభుత్వ ఆదేశాల మేరకు దౌల్తాపురం గ్రామంలో పొలం రీసర్వే చేపడుతున్నట్లు తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బంటనహాల్ గ్రామంలో పొలం రీసర్వే పనులు పూర్తి చేశామన్నారు. రైతులకు ఏదైనా రీసర్వే జరిగేటప్పుడు అనుమానాలు వచ్చినా వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దౌల్తాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించి ప్రజల సహకారంతో రీసర్వే పనులు చేపడతామని తెలిపారు. ప్రభుత్వం రైతుల భవిష్యత్తు కోసం వారికి పొలంపై ఏ సమస్యా రాకూడదని రీసర్వే పనులు చేపడుతోందన్నారు. రైతులందరికీ సమాచారం ఇచ్చిన తర్వాతనే రీసర్వే కొలతలు ప్రారంభిస్తామన్నారు.

నేడు మన్ను మారెమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



నూతన దేవాలయం, మన్ను మారెమ్మ దేవి విగ్రహం

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో శ్రీమన్ను మారెమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన చేపడుతున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి గోపూజ నిరీక్షణ, ప్రతిష్టంగా హోమం, ప్రాణ ప్రతిష్టాపన, పంచామృతాభిషేకం, గోపుర కలశ స్థాపన, కలశాభిషేకం, నైవేద్య సమర్పణ, మహామంగళ హారతి, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి 8.30 గంటలకు శ్రీరేణుక ఎల్లమ్మ దేవి మహత్యం బయలు నాటకం ఉంటుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నట్లు చెప్పారు.



హాజరైన గురురాజ్ దేశాయ్

గృహ ప్రవేశ వేడుకలో గురురాజ్ దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

నందవరం పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు రాజు నూతన గృహ ప్రవేశ వేడుకలో టిడిపి మండల నాయకులు గురురాజ్ దేశాయ్ పాల్గొని, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాధిక్, సలీం, అబ్దుల్, దానియేల్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలకు సిసి కెమెరాలు : ఎస్ఐ చంద్ర

ప్రజాశక్తి - హాలహర్వి

నేరాలు, ప్రమాదాల నియంత్రణకు సిసి కెమెరాలు ఎంతగానో తోడ్పడతాయని ఎస్ఐ చంద్ర తెలిపారు. గురువారం జాతీయ రహదారి కూడలిలో ఎస్‌పి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన మూడు సిసి కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సిసి కెమెరాలు నేషనల్ హైవేలో ఉన్న కూడలిలో ఆటో డ్రైవర్లు, షాపుల వారి సహాయ, సహకారాలతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాహనదారులు అన్నీ జాగ్రత్తలు పాటిస్తూ నియమ నిబంధనల మేరకు వాహనాలు నడపాలన్నారు.

శ్రీమఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని దర్శనార్థమై వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. గురువారం స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు.

ఉత్సాహంగా 'విజేత' స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ఉన్న విజేత టాలెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 15వ వార్షికోత్సవం, ఎస్‌జివిఎల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పాఠశాల మొదటి వార్షికోత్సవం గురువారం స్కూల్ ఆవరణలో ఉత్సాహ భరిత వాతావరణంలో నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ రంగస్వామి అధ్యక్షతన జరిగిన సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గ్రామ పెద్దలు ఆదినారాయణ రెడ్డి, మెడికల్ నాగరాజ్, కుప్పలదొడ్డి గర్జప్ప, బిపి.వీరేశప్ప, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రాము, మాజీ ఎంపిటిసి సభ్యులు బసవరాజ్ హాజరయి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కరస్పాండెంట్ రంగస్వామి మాట్లాడుతూ... ఉపాధ్యాయులంతా ఏకతాటిపై ఉంటూ సమన్వయంతో పని చేస్తారని, ఆరోగ్యకరమైన పోటీతత్వంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జావన్కి మల్లికార్జున, హెచ్‌కె.వీరేష్, సిఆర్‌సి హుస్సేనప్ప, మీసేవ నాగరాజ్, నాగేంద్రప్ప, ప్రధానోపాధ్యాయులు పరమేష్, రవి, ఉపాధ్యాయులు రమాదేవి, గాయత్రి, ఉమాదేవి, కాలింగ, మహబూబ్ బాషా, ఉల్లిగప్ప, లింగన్న, కాలింగప్ప, గాదిలింగమ్మ, భవాని, జ్యోతి, ఖాజా పాల్గొన్నారు.



కరస్పాండెంట్ రంగస్వామిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న కరస్పాండెంట్ రంగస్వామి